

5

రాష్ట్రంలో అద్దం లాంటి రోడ్ల నిర్మాణం


అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..



WANTED రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త JV NEWS

ఎడిటర్: బిర్రు కరుణాకర్

Cell:9701249103



సంపుటి - 3 సంచిక -35 శనివారం 4 జులై 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు 5 వెల - 5/- 01

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts


## ఎస్ఐఆర్ నిలిపేయండి..

సుప్రీంకోర్టుకు 23 మంది విపక్ష నేతల లేఖ

ఓటర్ల తొలగింపుపై తీవ్ర అభ్యంతరం

ఈవీఎంలపై ప్రజా చర్చ కోరిన విపక్షాలు

కేంద్ర సంస్థలను దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపణ

ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని వ్యాఖ్య




**న్యూఢిల్లీ, జూలై 03(జర్నలిస్ట్ వార్త);**
దేశ ఎన్నికల ప్రక్రియపై తీవ్ర ఆందోళనలు వ్యక్తం చేస్తూ విపక్షాలు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశాయి. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని కోరాయి. ప్రజాస్వామ్య వ్యవస్థకు ముప్పు ఏర్పడిందని ఆరోపించాయి.కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో పాటు 23 మంది విపక్ష నేతలు ఈ లేఖపై సంతకం చేశారు. ఎన్నికల ప్రక్రియలో ప్రజల అసలు తీర్పు ప్రతిబింబించడం లేదని ఆరోపించారు. స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికల**మిగతా 2లో...**

# కేసీఆర్ పాలనలో అప్పు 8 లక్షల కోట్లు

ఈ దోపిడీకి కారణం ఆయనే

అసెంబ్లీకి వచ్చి సమాధానం చెప్పాల్సిందే

కేటీఆర్, హరీశ్‌రావు స్థాయి ఏంటీ?

కాంగ్రెస్ అప్పు రూ.1.77 లక్షల కోట్లు

బీఆర్ఎస్ అప్పులు, వడ్డీలు కలిపి రూ.2.08 లక్షల కోట్లు చెల్లించాం

అబద్ధాలతో విషప్రచారం ఇంకెంత కాలం

సింగరేణి బొగ్గుపై సమగ్ర నివేదిక ఇవ్వండి : విజిలెన్స్ డైరెక్టర్‌కు ఉప ముఖ్యమంత్రి భట్టి ఆదేశం




**హైదరాబాద్ జూలై 03(జర్నలిస్ట్ వార్త);**
బీఆర్ఎస్ హయాంలో ముఖ్యమంత్రిగా కేసీఆర్ చేసిన అప్పు రూ.8,21,651 కోట్లని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. ఈ అప్పులపై కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ దోపిడీకి కారణం ఆయనేనన్నారు. కేటీఆర్, హరీశ్‌రావు సమాధానం చెప్పడానికి వారి స్థాయి ఏంటని ప్రశ్నించారు. ఎవరు ఏంటనేది ఇప్పటికే ప్రజలు నిర్ణయించారనీ, స్థాయి అనేది పుట్టుకను బట్టి రాదనీ, ప్రజాజీవితంలో పోషించే పాత్రను బట్టి వస్తుందని అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ లతో కలిసి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ పదేండ్లపాటు అధికారంలో ఉండి, రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటీఆర్, హరీశ్‌రావు అప్పులపై అబద్ధ పు ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. 2014 నుంచి 2023 వరకు రూ.8,21,651 కోట్ల అప్పు చేస్తే కేటీఆర్ మాత్రం రూ.2.78 లక్షల కోట్ల అప్పు చేశామని చెప్పడం సరైంది కాదన్నారు. అబద్ధాలను ప్రచార అస్త్రాలుగా మార్చుకుని, 'గోబెల్స్' ప్రచారానికి పాల్పడు తున్నారని దుయ్య బట్టారు. అబద్ధాల పునా దుల మీద ఏ ఆర్థిక వ్యవస్థను నిర్మించలేమనీ, వాస్తవాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు.**మిగతా 2లో...**



## గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో పవన్ కల్యాణ్ భేటీ

వివిధ అంశాలపై గవర్నర్ తో ఫలప్రదమైన చర్చ జరిగిందని వెల్లడించిన పవన్

అంతకుముందు సైబర్ క్రైమ్ ఐజీ ఆకే రవికృష్ణతో సమావేశం

గంజాయి, డ్రగ్స్ నిర్మూలనపై 'ఈగల్' విభాగం నివేదిక సమర్పణ

సోషల్ మీడియా వేధింపులపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని ఐజీ వెల్లడి

**అమరావతి జూలై 03(జర్నలిస్ట్ వార్త);**
ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శుక్రవారం నాడు రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్‌తో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఈ సాయంత్రం పవన్ విజయవాడలోని లోక్ భవన్ కు వెళ్లారు. ఈ భేటీ చాలా ఆత్మీయంగా, ఫలప్రదంగా జరిగిందని పవన్ కల్యాణ్ ఎక్స్ వేదికగా తెలిపారు. పలు అంశాలపై ఇరువురూ చర్చించుకున్నారని, గవర్నర్ మార్గదర్శకత్వం, ఆతిథ్యం పట్ల కృతజ్ఞతలు తెలియజేశారు. **2లో...**




## ఏపీ హైకోర్టుకు ముగ్గురు అదనపు న్యాయమూర్తులు..

కేంద్రం ఉత్తర్వులు

నియామకాలకు రాష్ట్రపతి ఆమోదం

మే 4న పేర్లు ఖరారు చేసిన కొలీజియం

కేంద్రం పరిశీలన తర్వాత ఉత్తర్వులు



**న్యూఢిల్లీ,జూలై 03(జర్నలిస్ట్ వార్త);**
ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు ముగ్గురు అదనపు న్యాయమూర్తుల నియామకానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. రాష్ట్రపతి ఆమోదంతో నియామక ఉత్తర్వులు జారీ చేసినట్లు కేంద్ర న్యాయశాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ వెల్లడించారు. అదనపు న్యాయమూర్తులుగా సునీత గంధం, ఆలపాటి గిరిధర్, పురుషోత్తం కుమార్ చింతలపూడి నియమితులయ్యారు. **మిగతా 2లో...**

## కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో జాతీయ సదస్సు

మీడియా,కమ్యూనికేషన్ నోడల్ అధికారులతో భేటీ

తెలంగాణ సమాచార, పౌరసంబంధాల శాఖ అధికారుల హాజరు

**న్యూఢిల్లీ,జూలై 03(జర్నలిస్ట్ వార్త);**
భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో నిర్వహించిన ఒకరోజు మీడియా / కమ్యూనికేషన్ నోడల్ అధికారుల జాతీయ సదస్సులో తెలంగాణ రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖకు చెందిన జిల్లా పౌర సంబంధాల అధికారులు, మీడియా నోడల్ అధికారులు, సోషల్ మీడియా నోడల్ అధికారులు పాల్గొన్నారు. దేశంలోని 15 రాష్ట్రాలు, కేంద్ర **మిగతా 2లో...**




## సవాల్‌పై కట్టుబడి ఉన్నందునే వచ్చా

ప్రెస్‌క్లబ్‌కు చేరుకున్న జూపల్లి

అబద్దాల లేఖలతో ప్రచారం చేస్తున్న హరీష్ రావు

బిఆర్ఎస్ నేతల తీరుపై మండిపడ్డ మంత్రి

**హైదరాబాద్, జూలై 03(జర్నలిస్ట్ వార్త);** తెలంగాణ అప్పులపై సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో చర్చకు సిద్ధమని ప్రకటించిన మంత్రి జూపల్లి కృష్ణారావు సాయంత్రిం ప్రెస్‌క్లబ్‌కు వచ్చారు. శుక్రవారం ఉదయం కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌కు ఆయన సవాల్ విసిరారు. సాయంత్రం 5 గంటలకు సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌కు వస్తానని చెప్పారు. ఈ మేరకు మంత్రి జూపల్లి శుక్రవారం సాయంత్రం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌కు చేరుకున్నారు. ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ.. సవాల్‌పై **మిగతా 2లో...**



## అప్పులపై అబద్దాలు

పూటకో మాట.. రోజుకో అడ్రస్‌లా జూపల్లి తీరు

విమర్శలు గుప్పించిన బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు


**సంగారెడ్డి, జూలై 03(జర్నలిస్ట్ వార్త);**
కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో చేసిన అప్పుల విషయంలో అబద్దాలు చెప్తున్నదని మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. సంగారెడ్డిలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అధ్యక్షతన ఎస్ఐఆర్ పై నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. తెలంగాణ ఏర్పడిన తరువాత రాష్ట్రంలో చేసిన అప్పు రూ. 1,77,058 కోట్లు అని మంత్రి జూపల్లి కృష్ణారావు నాకు లేఖ రాశాడు. కానీ రేవంత్ రెడ్డి నాలుగు నెలల క్రితం అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అప్పు రూ.3,45,294 కోట్లు అని చెప్పాడు. నాలుగు నెల కిందనే నిండు అసెంబ్లీలో రేవంత్ రెడ్డి అంత చెప్పాడు అంటే ఈ నాలుగు నెలలది కూడా కలిపితే రూ. 4 లక్షల**మిగతా 2లో...**



## రుషికొండ ప్రాజెక్టును అభివృద్ధికి చర్యలు

ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ తరహాలో అప్పగింత

ఏపీటీడీసీ ఆధ్వర్యంలో ప్రైవేట్ భాగస్వామ్యానికి అవకాశం




**అమరావతి జూలై 03(జర్నలిస్ట్ వార్త);**
రుషికొండ భవనాల విషయంలో ఏపీ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్(ఏపీటీడీసీ) కీలక నిర్ణయం తీసుకుంది. హిల్‌టాప్‌లోని భవనాల నిర్వహణ, ఆపరేషన్, మార్కెటింగ్ కోసం ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంటెస్ట్ ను ఆహ్వానిస్తూ ప్రకటన విడుదల చేసింది.**మిగతా2లో...**

## అమర్‌నాథ్ యాత్రికులకు మోడీ శుభాకాంక్షలు

యాత్రలో పాల్గొనడం గొప్ప అనుభూతిగా వెల్లడి

యాత్రలో జాగ్రత్తలు పాటించాలంటూ ఎక్స్ వేదికగా పిలుపు

**న్యూఢిల్లీ, జూలై 03(జర్నలిస్ట్ వార్త);**
అమర్‌నాథ్ యాత్రను పురస్కరించుకుని ప్రధాని నరేంద్ర మోదీ భక్తులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ పవిత్ర యాత్రను ఒక 'గొప్ప భాగ్యం'గా అభివర్ణించిన ప్రధాని, భక్తి శ్రద్ధలతో, క్రమశిక్షణతో, బాధ్యతాయుతమైన జాతీయ భావనతో భక్తులు ఈ ప్రయాణాన్ని కొనసాగించాలని కోరారు. శివభక్తులను ఉద్దేశించి రాసిన లేఖను ఎక్స్ వేదికగా పంచుకుంటూ మోదీ పలు కీలక విషయాలను ప్రస్తావించారు.'పవిత్రమైన అమర్‌నాథ్ యాత్రలో పాల్గొనడం ఒక గొప్ప భాగ్యం. ప్రతి సంవత్సరం మంచు లింగాన్ని నేరుగా దర్శించుకునే ఈ అవకాశం లక్షలాది మంది శివభక్తులకు అత్యంత పవిత్రమైన, మరపురాని**మిగతా 2లో...**



# ఎస్ఐఆర్ నిలిపేయండి..

**మొదటిపేజీ తరువాయి**

సూత్రాలు దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు.ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ రాజకీయ ఉద్దేశాలతో జరుగుతోందని విపక్షాలు ఆరోపించాయి. సరైన పత్రాలు లేని పేదలు, దళితులు, ఆదివాసీలు, మైనారిటీల ఓటు హక్కు ప్రమాదంలో పడుతోందని పేర్కొన్నాయి. లక్షలాది మంది నిజమైన ఓటర్లు జాబితాల నుంచి తొలగింపునకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశాయి.పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో 27 లక్షల మంది ఓటర్ల పేర్లు తొలగించారని లేఖలో పేర్కొన్నారు. 'లాజికల్ డిస్‌క్రిపెన్సీస్' పేరుతో ఈ తొలగింపులు జరిగాయని తెలిపారు. ఒక న్యాయ ట్రైబ్యునల్ పరిశీలించిన 1,777 కేసుల్లో 1,717 తొలగింపులు తప్పుగా జరిగాయని గుర్తించినట్లు వెల్లడించారు.ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై కూడా ప్రజల్లో అనుమానాలు పెరుగుతున్నాయని విపక్షాలు తెలిపాయి. అవసరమైతే బ్యాలెట్ పేపర్ విధానాన్ని తిరిగి పరిశీలించాలని సూచించాయి. దీనిపై విస్తృత ప్రజా చర్చ జరగాలని కోరాయి.సీబీఐ, ఈడీ, ఎన్ఐఏ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను విపక్షాలపై రాజకీయ అస్త్రాలుగా ఉపయోగిస్తున్నారని ఆరోపించాయి. ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసేలా వ్యవస్థలను వినియోగిస్తున్నారని పేర్కొన్నాయి.రాజ్యాంగ పరిరక్షణ బాధ్యత సుప్రీంకోర్టుదేనని లేఖలో పేర్కొన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు తక్షణ జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని సుప్రీంకోర్టును కోరారు.

# గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో పవన్ కల్యాణ్ భేటీ

**మొదటిపేజీ తరువాయి**

అంతకుముందు, పవన్ కల్యాణ్ మంగళగిరిలోని తన క్యాంపు కార్యాలయంలో 'ఈగల్' విభాగం చీఫ్, సైబర్ క్రైమ్ ఐజీ ఆకే రవికృష్ణతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఈగల్ విభాగానికి సంబంధించిన వార్షిక నివేదికను ఐజీ, పవన్‌కు అందజేశారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల నివారణకు తీసుకుంటున్న చర్యలు, సాధించిన ఫలితాలను నివేదికలో పొందుపరిచారు.అలాగే, సోషల్ మీడియాలో జరుగుతున్న వేధింపులు, ట్రోలింగ్, ముఖ్యంగా మహిళలను లక్ష్యంగా చేసుకుని అసభ్యకర పోస్టులు పెట్టేవారిపై సైబర్ క్రైమ్ విభాగం తీసుకుంటున్న కఠిన చర్యల గురించి పవన్ కల్యాణ్‌కు వివరించారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చ జరిగింది.

## ఏపీ హైకోర్టుకు ముగ్గురు అదనపు న్యాయమూర్తులు..

**మొదటిపేజీ తరువాయి**

భారత ప్రధాన న్యాయమూర్తితో సంప్రదింపుల అనంతరం రాష్ట్రపతి ఈ నియామకాలు చేపట్టినట్లు కేంద్రం తెలిపింది.ఈ ముగ్గురి పేర్లను సుప్రీంకోర్టు కొలీజియం ఈ ఏడాది మే 4న జరిగిన సమావేశంలో ఆమోదించింది. అనంతరం నియామక ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం పరిశీలించింది.హైకోర్టు న్యాయమూర్తుల నియామక ప్రక్రియలో ముందుగా సంబంధిత హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి పేర్లను ప్రతిపాదిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం వాటిని కేంద్రానికి పంపిస్తుంది. అనంతరం కేంద్రం పరిశీలించి ప్రధాన న్యాయమూర్తి అభిప్రాయం తీసుకుంటుంది. అన్ని దశలు పూర్తైన తర్వాత రాష్ట్రపతి నియామక ఉత్తర్వులపై సంతకం చేస్తారు. అనంతరం కేంద్ర న్యాయశాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేస్తుంది.

# రుషికొండ ప్రాజెక్టును అభివృద్ధికి చర్యలు

**మొదటిపేజీ తరువాయి**

లీజ్, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ మోడల్‌లో రుషికొండ ప్రాజెక్టును అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో ఏపీటీడీసీ ఆధ్వర్యంలో ప్రైవేట్ భాగస్వామ్యానికి అవకాశం కల్పించనుంది. ఎంపికైన ప్రైవేట్ సంస్థ.. ఐదు భవనాల సముదాయాన్ని నిర్వహించనుంది. మొత్తం 9.8 ఎకరాల హిల్‌టాప్ ప్రాజెక్టును మోడల్‌లో ప్రభుత్వం వినియోగించనుంది. రుషికొండ దిగువ ప్రాంతంలో ఉన్న మరో 9 ఎకరాల భూమి అభివృద్ధికి కూడా అవకాశం కల్పించనుంది. హోటళ్లు, రిసార్టులు, పర్యాటక మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు ఏపీటీడీసీ తెలిపింది. సాధారణ ప్రజలకు అందుబాటులో ఉండే వ్యూయింగ్ ఏరియాలు, ఓపెన్ స్పేస్‌లు తప్పనిసరిగా ఉండేలా నిబంధనలు విధించింది. ప్రస్తుత భవనాలతో పాటు అదనపు అభివృద్ధికి కూడా ప్రభుత్వం అవకాశం కల్పించింది. రెండు ఖాళీ స్థలాల్లో మొత్తం 2,400 చదరపు మీటర్ల విస్తీర్ణంలో అభివృద్ధికి అవకాశం ఉండగా, అదనంగా సుమారు 4,800 చదరపు మీటర్ల వరకు జీప్లస్ 1 నిర్మాణాలకు అనుమతి ఇవ్వనుంది. సీఆర్‌జెడ్ నిబంధనలు, చట్టబద్ధ అనుమతుల ప్రకారమే అన్ని నిర్మాణాలు చేపట్టాలని ఏపీటీడీసీ స్పష్టం చేసింది. పెట్టుబడిదారుల ఆసక్తి, ప్రాజెక్టు వాణిజ్య సాధ్యాసాధ్యాలను ఇక్షఏ ద్వారా అంచనా వేసి... అనంతరం ఆర్ఎఫ్‌పీ దశలో తుది ఎంపిక పక్రియ జరగనుంది. హోటల్ చైన్లు, రిసార్ట్ డెవలపర్లు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఏపీటీడీసీ వెల్లడించింది. హాస్పిటాలిటీ రంగంలో అనుభవం ఉన్న సంస్థలకే అర్హత

కల్పించనున్నట్లు తెలిపింది. మార్చి 31, 2025 నాటికి పాజిటివ్ నెట్‌వర్త్ తప్పనిసరి అని పేర్కొంది. ఇక్షఏ దాఖలుకు చివరి తేదీ జులై 10 సాయంత్రం 5 గంటలుగా నిర్ణయించారు. తుది లీజ్ నిబంధనలు, ఆదాయ భాగస్వామ్యం తదితర అంశాలను ఖీఈఖ దశలో ఖరారు చేయనున్నట్లు ఏపీటీడీసీ వెల్లడించింది.

## అమర్‌నాథ్ యాత్రికులకు మోడీ శుభాకాంక్షలు

**మొదటిపేజీ తరువాయి**

అనుభూతిని ఇస్తుంది. ఈ సంవత్సరం యాత్రకు సిద్ధమవుతున్న భక్తులందరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు.' అని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. ఈ యాత్ర భారతదేశ ఆధ్యాత్మిక సంప్రదాయంలో ఒక శాశ్వతమైన అధ్యాయమని ప్రధాని కొనియాడారు. ప్రపంచవ్యాప్తంగా సనాతన సంస్కృతిని అనుసరించే లక్షలాది మంది భక్తులు ప్రతి ఏటా బాబా అమర్‌నాథ్ ఆశీస్సుల కోసం జమ్మూ కశ్మీర్‌కు వస్తుంటారని గుర్తుచేశారు. వివిధ ప్రాంతాలు, విభిన్న భాషలు, భిన్నమైన ఆచారాలు ఉన్నప్పటికీ.. మహాదేవుని ఆశీస్సులు పొందాలనే ఒకే ఒక సంకల్పంతో భక్తులంతా ఇక్కడికి తరలివస్తారని, ఈ రెండు నెలల కాలంలో బాబా బర్ఫానీ పవిత్ర సన్నిధిలో భారతదేశ 'భిన్నత్వంలో ఏకత్వం' అనే అద్భుత దృశ్యం ఆవిష్కృతమవుతుందని మోదీ అన్నారు. ఈ యాత్ర సజావుగా సాగడానికి అహర్నిశలు శ్రమిస్తున్న భారత సైన్యం, సీఆర్‌పీఎఫ్, జమ్మూ కశ్మీర్ పోలీస్, ఐటీబీపీ, బీఎస్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బందితో పాటు ఆరోగ్య కార్యకర్తలు, పరిపాలనా అధికారులు, పారిశుద్ధ్య కార్మికులు, వాలంటీర్లకు ప్రధాని మోదీ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఏడాది యాత్ర సందర్భంగా భక్తులందరూ తమ జీవితంలో ఐదు ముఖ్యమైన సంకల్పాలను స్వీకరించాలని ప్రధాని పిలుపునిచ్చారు. అమర్‌నాథ్ యాత్ర మార్గంలో ఎక్కడా చెత్తాచెదారం వేయకుండా, పరిశుభ్రత నియమాలను తూచా తప్పకుండా పాటించాలన్నారు. వాతావరణ మార్పులు, వర్షాల నేపథ్యంలో జారే మార్గాల పట్ల అప్రమత్తంగా ఉంటూ, పరిపాలనా యంత్రాంగం ఇచ్చే ఆదేశాలను, ట్రాఫిక్ నిబంధనలను, భద్రతా సూచనలను పూర్తిగా అంకితభావంతో పాటించాలని సూచించారు. స్థానిక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు, యాత్రికులు తమ ప్రయాణ ఖర్చులలో కనీసం 10 శాతం మొత్తాన్ని జమ్మూ కశ్మీర్‌లోని స్థానిక ఉత్పత్తులను కొనుగోలుకు కేటాయించాలి. ఇది అక్కడి కుటుంబాలకు, యువతకు ఉపాధినిస్తుందన్నారు. రక్షాబంధన్ పండుగతో ముగిసే ఈ యాత్ర ముగింపు సందర్భంగా.. 'ఏక్ పేడ్ మా కే నామ్' అమ్మ పేరిట ఒక మొక్క ప్రచారంలో భాగంగా ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటాలన్నారు. దేశమే ప్రథమమనే భావనతో, మన బాధ్యతలను ఏడాది పొడవునా నిజాయితీగా నిర్వర్తిస్తూ, 'వికసిత్ భారత్' నిర్మాణంలో చురుకైన పాత్ర పోషించాలి. చివరగా, భక్తులందరి ప్రయాణం సుఖమయంగా, సురక్షితంగా, ఆధ్యాత్మికంగా సాగాలని ప్రధాని ఆకాంక్షించారు.

# అప్పులపై అబద్ధాలు

**మొదటిపేజీ తరువాయి**

కోట్లు దాటుతుందన్నారు. జూపల్లి ఒక మాట చెబుతున్నాడు, రేవంత్ రెడ్డి ఇంకో మాట చెబుతున్నాడు. ఇప్పుడు రాజీనామా ఎవరు చేయాలి? అని హరీశ్ రావు సూటిగా ప్రశ్నించాడు. పూటకో సవాల్.. రోజుకో అడ్రస్‌లా మంత్రి జూపల్లి కృష్ణారావు తీరు ఉందని హరీశ్‌రావు విమర్శించారు. మంత్రి జూపల్లి సవాళ్లు నిన్నే చూశాం.. ఏమైందో అందరికీ తెలుసు. తెలంగాణ భవన్‌కు వస్తానని చెప్పింది ఆయనే. వెంటనే మాట మార్చి గన్‌పార్క్‌కు వెళ్లారు. గన్‌పార్క్‌కు వెళ్లకుండా పోలీసులు మమ్మల్ని అడ్డుకున్నారు. చర్చకు కేసీఆర్ రావాలని ఇప్పుడు అంటున్నారు. జూపల్లి వాట్సప్‌లో లేఖ పెట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక వాళ్లు చేసిన అప్పులు లేఖలో రాశారు. తాము వచ్చాక రూ.1.77లక్షల కోట్లు అప్పు చేశామని జూపల్లే చెప్పారు. ఆర్‌బీఐ వద్ద తెచ్చిన ఎఫ్ఆర్‌బీఎం అప్పులు మొత్తం చెబుతా. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అప్పు రూ.1.86లక్షల కోట్లు. ఆర్‌బీఐ తెచ్చిన అప్పులోనే తేడాలు చెప్పారు. ఏం చేయాలో అర్థంకాక డ్యామేజ్ కంట్రోల్ చేసుకుంటున్నారు' అని హరీశ్‌రావు విమర్శించారు.

# కేసీఆర్ పాలనలో అప్పు 8 లక్షల కోట్లు

**మొదటిపేజీ తరువాయి**

అప్పులు, వడ్డీలు కలిపి (రూ.2.08 లక్షల కోట్లు చెల్లించాం

ఈ రెండున్నరేండ్లలోనే ప్రజాప్రభుత్వం రూ.1.77 లక్షల కోట్ల అప్పు చేసిందని భట్టి చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన అప్పుల కు రూ.2,08,681 కోట్లను అసలు, వడ్డీల రూపంలో బ్యాంకులకు చెల్లించిందని భట్టి వెల్లడించారు. కేవలం రూ.మూడు లక్షల కోట్లే అప్పు చేశామని కేటీఆర్, హరీశ్‌రావు అబద్ధా లు చెప్తే ఎలా? అని ప్రశ్నించారు. రిజర్వ్ బ్యాంక్ ద్వారా ప్రభుత్వ ఖాతాల నుంచి కట్టిన భారీ మొత్తం దేనికో వారే సమాధానం చెప్పా లని సవాల్ విసిరారు. భవిష్యత్ లోనూ కేసీఆరే మళ్లీ వస్తారని కేటీఆర్, హరీశ్‌రావు అంటు న్నారని, అలాంటప్పుడు మధ్యలో వారు చేసే ఈ హంగామా దేనికోసమని ప్రశ్నిం చారు. వారికి గతం లేదు, భవిష్యత్ లేదు, కనీసం నైతి కత అయినా ఉండాలి కదా? అని అన్నారు.

### అప్పు భారం తగ్గించాం

బీఆర్ఎస్ ప్రభుత్వం కార్పొరేట్ బ్యాంకుల వద్ద 10 శాతం నుంచి 10.5 శాతం వరకు భారీ వడ్డీ రేట్లతో అప్పులు తెచ్చి రాష్ట్రంపై పెనుభారం వేసిందని భట్టి చెప్పారు. ప్రజా ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ, ఆ అప్పులను డెబిట్ రీస్ట్రక్చరింగ్ ప్రక్రియలోకి తెచ్చిందన్నారు. దీనివల్ల 2025-26 నుంచి 2031-32 మధ్య కాలంలో చెల్లించాల్సిన రూ. 34,058 కోట్ల రుణ భారాన్ని, రూ.11,915 కోట్లకు తగ్గించామని వివరిం చారు. దీని ద్వారా రాష్ట్రానికి రూ.22,142 కోట్లు ఆదా అయ్యిందని చెప్పారు. అడ్డగోలుగా అప్పులు తెచ్చిన వారు, ఇలాంటి ఆర్థిక నిర్వహణపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**సింగరేణిపై విషప్రచారం ఆపండి!**

సింగరేణి సంస్థపై ప్రతిపక్ష నేతలు చేస్తున్న అసత్య ప్రచారాన్ని భట్టి తప్పుబట్టారు. ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణి ఆస్తులు, వనరులు రాష్ట్రానివని వివరించారు. "పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో సింగరేణికి కొత్తగా ఒక్క కోల్ బ్లాక్‌నైనా తెచ్చారా? కనీసం ఉత్పత్తి అయిపోయి మూతపడిన మైనింగ్ బ్లాకులకు బదులుగా కొత్తవి ప్రారంభించారా" అని సూటిగా ప్రశ్నించారు. భద్రాద్రి, యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టులను భారీగా విస్తరించిన కేసీఆర్ ప్రభుత్వం, వాటికి అవసరమైన బొగ్గు గనులను మాత్రం ఎందుకు సమకూర్చలేదని నిలదీశారు. కేంద్రం వేలం వేసిన కోల్ బ్లాకుల్లో పాల్గొని సింగరేణికి ఆ గనులను ఎందుకు దక్కించలేకపోయారని ప్రశ్నించారు. సింగరేణికి గనులు వస్తే రాయల్టీ రూపంలో వచ్చే ఆదాయం తెలంగాణకే చెందేదని అన్నారు. రాష్ట్రంలో బొగ్గు కొరత సృష్టించి, విద్యుత్ ప్రాజెక్టులను సంక్షోభంలోకి నెట్టడమే బీఆర్ఎస్ ఉద్దేశమా? అని ప్రశ్నించారు. సింగరేణి కాలరీస్‌లో 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందని బీఆర్ఎస్ చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్త వమన్నారు. సింగరేణి అస్తిత్వం, కార్మికుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేందుకు చేస్తున్న దుష్ప్రచారమని చెప్పారు. సింగరేణి సంస్థలో ఎటువంటి అక్రమాలకు తావులేదనీ, సంస్థ భద్రత కోసం అత్యున్నత స్థాయి జియో-ఫెన్సింగ్ వ్యవస్థ ఉందని ఆయన స్పష్టం చేశారు. ఒక్క కిలో బొగ్గు కూడా మాయం కావడానికి అవకాశం లేన్నారు.

సింగరేణి బొగ్గు మాయం వ్యవహారంపై సమగ్ర నివేదికను ఇవ్వాలని విజిలెన్స్ డైరెక్టర్‌ను భట్టి ఆదేశించారు. కోయగూడెం, సత్తుపల్లి-3 వంటి బొగ్గు బ్లాకులను సింగరేణికి దక్కకుండా చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని విమర్శిం చారు. వాటిని ప్రయివేటు వ్యక్తులకు కట్టబెట్ట డంలో కేసీఆర్ సర్కార్ పాత్ర ఉందన్నారు. దాదాపు 65 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలున్న సత్తుపల్లి-3 బ్లాకును ప్రయివేటు వారికి ఎందుకిచ్చారని ప్రశ్నిం చారు. సింగరేణిని ఆర్థికంగా దెబ్బతీసి, థర్మల్ పవర్ ప్రాజెక్టులకు బొగ్గు కొరత సృష్టించి, ప్రయివేటు వ్యక్తుల నుంచి బొగ్గు కొనుగోలు చేయాలన్నదే బీఆర్ఎస్ ప్రభుత్వ దుర్మార్గపు ఆలోచన అని ఆరోపించారు. గత పదేండ్లలో ఇరిగేషన్, రోడ్ల నిర్మాణాల పేరుతో ఎస్ఎస్ఆర్ రేట్లు పెంచిన బీఆర్ఎస్ ప్రభుత్వం గురుకుల పాఠశాలల్లో పిల్లలు తినే ఆహారానికి గానీ, వారి కాస్మోటిక్ ఛార్జీలకు గానీ రేట్లు ఎందుకు పెంచలేదని ప్రశ్నించారు. డైట్ ఛార్జీలను ఆరు నుంచి తొమ్మిది నెలల పాటు పెండింగ్‌లో పెట్టి విద్యార్థులను ఇబ్బందులకు గురిచేసిన ఘనత గత ప్రభుత్వానిదేనన్నారు. పిల్లల డైట్, కాస్మోటిక్ ఛార్జీలను పెంచామన్నారు. నాణ్యత తో కూడిన దుస్తులు, షూస్, పుస్తకాలను ఓపెన్ టెండర్ల ద్వారా పారదర్శ కంగా అందిస్తు న్నామని వివరించారు. టెండర్ విలువ రూ. 1,142 కోట్లు ఉంటే, రూ.రెండు వేల కోట్ల దోపిడీ జరిగిందని ఆరోపించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

**మా పిల్లలు మఫత్‌లాల్ బట్టలు, షూ వేసుకోవద్దా? : అడ్లూరి**

గురుకులాల్లో చదివే పిల్లలు మఫత్‌లాల్ బట్టలు, షూ వేసుకోవద్దా? అని హరీశ్‌రావును మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రశ్నించారు. పారదర్శకంగా ఉండేందుకు రూ.1,42 కోట్లకు గ్లోబల్ టెండర్లను పిలిచామన్నారు. అంతకంటే ఒక్క రూపాయి ఎక్కువ టెండర్ పిలవలేదని చెప్పారు. హరీశ్‌రావు చెప్పినట్టు రూ.రెండు వేల కోట్ల కుంభకోణం ఎక్కడ జరిగిందన్నారు. అది జరిగినట్టు నిరూపిస్తే దేనికైనా సిద్ధమనీ, మాటకు కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తాను ఫోన్ ఎత్తలేదని కొందరు దుష్ప్రచారం చేశారని అన్నారు. తాను పిరికివాడి, భయపడే వ్యక్తిని కాదన్నారు. అధికారిక కార్యక్రమంలో ఉన్నందు వల్లే ఫోన్ ఎత్తలేదని చెప్పారు.

# సవాల్‌పై కట్టుబడి ఉన్నందునే వచ్చా




**మొదటిపేజీ తరువాయి**

కట్టుబడి ఉన్నందునే ప్రెస్‌క్లబ్‌కు వచ్చానన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు కోసం ఎదురుచూస్తున్నానని తెలిపారు. తాను వెనుకడుగు వేసి పారిపోయే వ్యక్తిని కానన్నారు.. 'కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుకు 4 పేజీల చొప్పున లేఖలు రాశా. ముగ్గురికీ వాట్సాప్‌లోనూ ఆధారాలతో లేఖలు పంపించా. రూ.4.17 లక్షల కోట్ల అప్పు అంటూ హరీశ్ రిటర్న్ లేఖ పంపారు. రూ.8.21 లక్షల కోట్ల అప్పు అని లేఖలో చెప్పా. పారిపోవడం మా ఇంటావంటా లేదు. ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా అసత్యాలు ప్రచారం చేస్తున్నారు. లేఖలో తాను ప్రస్తావించినవి అబద్దాలని నిరూపించ గలరా అని మంత్రి ప్రశ్నించారు. తాను చెప్పినవి అబద్ధాలైతే రాజీనామాకు సిద్ధం అంటూ పునరుద్ఘాటించారు. హరీశ్‌రావు సొల్లు పురాణం చెబుతున్నారు. నా ప్రశ్నలకు సమాధానం దాటవేస్తున్నారు. నేను అడిగింది ఏంటి? హరీశ్ చెప్పిందేంటి అని నిలదీసారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్ కోసం 3 కుర్చీలు వేశాం. హరీశ్‌రావు రాసిన లేఖలో ఏమీ లేదు. ఇప్పటికైనా విలువలతో బతకండి' అని అన్నారు. కాగా, చర్చకు రావాలని పిలిచి పోలీసులతో అడ్డుకుంటున్నారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపిస్తున్నారు. అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

# కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో జాతీయ సదస్సు

**మొదటిపేజీ తరువాయి**

పాలిత ప్రాంతాలకు చెందిన సుమారు 240 మంది జిల్లా పౌర సంబంధాల అధికారులు హాజరైన ఈ సదస్సులో ఎన్నికల నిర్వహణలో కమ్యూనికేషన్ పాత్ర, మీడియా నిర్వహణ, ఎన్నికల చట్టాలు, డిజిటల్ సాంకేతికత వినియోగం, తప్పుడు ప్రచారాల నియంత్రణ, సోషల్ మీడియా సవాళ్లు, ఎన్నికల సమాచారాన్ని ప్రజలకు వేగంగా చేరవేసే విధానాలపై ఎన్నికల సంఘం అధికారులు సమగ్రంగా వివరించారు. ఈ సందర్భంగా భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ మాట్లాడుతూ, స్వేచ్ఛాయుత, నిష్పాక్షిక, పారదర్శక ఎన్నికల నిర్వహణలో మీడియా, ప్రజా సంబంధాల అధికారుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. ఎన్నికల సంఘం విడుదల చేసే అధికారిక సమాచారాన్ని ప్రజలకు వేగంగా చేరవేయడంతో పాటు తప్పుడు ప్రచారం, అపోహలు, దుష్ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పికొట్టాల్సిన బాధ్యత కమ్యూనికేషన్ అధికారులపై ఉందని పేర్కొన్నారు. ÷-రత్యేక ఓటరు జాబితా సవరణ సర్ పక్రియ ప్రాధాన్యాన్ని వివరిస్తూ, పౌరసత్వ చట్టం-1955 నిబంధనలకు అనుగుణంగా అర్హులైన భారతీయ పౌరుల పేర్లు మాత్రమే ఓటరు జాబితాలో ఉండేలా ఈ పక్రియ చేపడుతున్నట్లు తెలిపారు. ఎన్నికల పక్రియపై ప్రజల్లో అపోహలు తొలగించి వాస్తవాలను చేరవేయడంలో మీడియా, ప్రజా సంబంధాల అధికారుల పాత్ర అత్యంత ముఖ్యమని చెప్పారు. సదస్సులో ఎన్నికల నిర్వహణలో పారదర్శకత, ఫారం-17సీ, ఆర్టికల్-324 కింద ఎన్నికల సంఘానికి ఉన్న అధికారాలు, ఎన్నికల ప్రచార నిబంధనలు, పెయిడ్ న్యూస్ నియంత్రణ, సోషల్ మీడియా, కృత్రిమ మేధ వల్ల ఎదురవుతున్న సవాళ్లు, వాటిని ఎదుర్కొనే వ్యూహాలపై ఎన్నికల సంఘం సీనియర్ అధికారులు ప్రత్యేక ప్రజెంటేషన్లు ఇచ్చారు. అలాగే, ఎన్నికల సంఘం రూపొందించిన సమగ్ర డిజిటల్ వేదిక ద్వారా ఓటరు నమోదు, ఓటరు వివరాల సవరణ, పోలింగ్ కేంద్రాల సమాచారం, అభ్యర్థుల అఫిడవిట్లు, ఎన్నికల ఫలితాలు తదితర సేవలను ఒకే వేదికపై ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చిన విధానాన్ని వివరించారు. ప్రతి స్మార్ట్‌ఫోన్ వినియోగదారుడు వినియోగించేలా విస్తృత ప్రచారం చేపట్టాలని సూచించారు. సదస్సులో ఎన్నికల కమ్యూనికేషన్‌ను మరింత సమర్థవంతంగా నిర్వహించే విధానాలు, మీడియాతో సమన్వయం, సోషల్ మీడియా వినియోగం, ప్రజల్లో ఎన్నికలపై అవగాహన పెంపు, తప్పుడు ప్రచారాన్ని వేగంగా ఖండించే వ్యూహాలపై విస్తృతంగా చర్చించి పలు సూచనలు చేశారు. తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారుల కార్యాలయం నుంచి అదనపు ప్రధాన ఎన్నికల అధికారి ఎన్. శంకర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రసన్నరాజ్, తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ సంయుక్త సంచాలకులు యు. వెంకటేశ్వరరావు, తెలంగాణ రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ కమిషనరేట్ పౌర సంబంధాల అధికారులు ఎం. కిరణ్మయి, ఏ. వనజతో పాటు మీనాక్షి, ఇందిర, అనిల్, విశ్వేశ్ తదితర జిల్లా ప్రజా సంబంధాల అధికారులు పాల్గొన్నారు.

# గూగుల్ కంటే కుప్పం ప్రాజెక్టులే ఎక్కువ సంతోషాన్నిచ్చాయి

**కుప్పంలో రూ.9,322 కోట్ల విలువైన 27 పరిశ్రమలకు వర్చువల్‌గా శంకుస్థాపన**

**అడిడాస్ షూస్, విమానాల తయారీ వంటి కీలక కంపెనీలతో వేల ఉద్యోగాలకు అవకాశం**

**శంకుస్థాపన రోజే ప్రాజెక్టుల ప్రారంభ తేదీలను ప్రకటించిన పారిశ్రామికవేత్తలు**

**దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా కుప్పాన్ని తీర్చిదిద్దుతానని ముఖ్యమంత్రి హామీ**



"గూగుల్ ఏఐ డేటా సెంటర్ శంకుస్థాపన చేసిన నాటి కంటే, ఇవాళ జరిగిన కార్యక్రమాలతోనే నాకు ఎక్కువ సంతోషంగా ఉంది" అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. తన సొంత నియోజకవర్గమైన కుప్పం రూపురేఖలను మార్చే భారీ పారిశ్రామిక ప్రగతికి శ్రీకారం చుట్టిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం గుడుపల్లె మండలం పొగురుపల్లిలో "స్వర్ణ కుప్పం.. పెట్టుబడుల వేదిక" పేరుతో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ వేదికపై నుంచి వేల కోట్ల రూపాయల పెట్టుబడులతో, వేలాది మందికి ఉద్యోగాలు కల్పించే పలు కీలక ప్రాజెక్టులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు.

ఒకప్పుడు మారుమూల ప్రాంతంగా ఉన్న కుప్పం, ఇప్పుడు అభివృద్ధి కేంద్రంగా మారుతోందని చంద్రబాబు అన్నారు. మొత్తం రూ.9,322 కోట్ల పెట్టుబడులతో 27 పరిశ్రమలు కుప్పంలో కొలువుదీరనున్నాయని ప్రకటించారు. ఫుట్‌వేర్ నుంచి విమానాల తయారీ వరకు వివిధ రంగాలకు చెందిన ప్రఖ్యాత కంపెనీలు తమ యూనిట్లను ఇక్కడ ఏర్పాటు చేస్తున్నాయి.

ఇందులో భాగంగా ప్రపంచ ప్రఖ్యాత బ్రాండ్ అడిడాస్ ఫుట్‌వేర్ తయారీ యూనిట్‌కు సీఎం భూమిపూజ చేశారు. హ్వాసెంగ్ గ్రూప్ ఆధ్వర్యంలో రూ.899 కోట్ల పెట్టుబడితో ఏర్పాటవుతున్న ఈ పరిశ్రమ ద్వారా ఏకంగా 20,145 మందికి ఉపాధి లభించనుంది.

దేశంలోనే తొలి బ్యాటరీ అనోడ్ మెటీరియల్ ప్లాంట్‌కు కుప్పంలో శ్రీకారం చుట్టారు. అథా గ్రూప్ రూ.2,081 కోట్ల భారీ పెట్టుబడితో ఈ యూనిట్‌ను ఏర్పాటు చేస్తుండగా, దీని ద్వారా 2,600 మందికి ఉద్యోగాలు రానున్నాయి. ఏ

వియేషన్ రంగంలోనూ కుప్పం తనదైన ముద్ర వేయనుంది. పయనీర్ క్లీన్ యాంప్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.150 కోట్ల పెట్టుబడితో టూ సీటర్ ట్రైనర్ విమానాల తయారీ యూనిట్‌ను నెలకొల్పనుంది. దీనివల్ల 1,400 మందికి ఉపాధి దొరుకుతుంది.

వీటితో పాటు ఎంఏఎఫ్ క్లోతింగ్ (గార్మెంట్స్), న్యూట్రి ఫీడ్స్ (చికెన్ ప్రాసెసింగ్), ఫామ్ అమినో అగ్రిటెక్ (కర్కుమిన్ ఎక్స్‌ట్రాక్షన్) వంటి అనేక ఇతర పరిశ్రమల నిర్మాణాలకు కూడా ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా పరిశ్రమలకు ఏపీ ప్రభుత్వం అందిస్తున్న సహకారం అద్భుతంగా ఉందని పారిశ్రామికవేత్తలు ప్రశంసించారు. ప్రభుత్వ ప్రోత్సాహం చూశాక, పనులను మరింత వేగంగా పూర్తి చేయాలనే ఉత్సాహం కలుగుతోందని తెలిపారు. శంకుస్థాపన రోజే ప్రారంభోత్సవ తేదీలను నిర్దేశించుకుని పనిచేయాలని పారిశ్రామికవేత్తలకు సీఎం సూచించగా, వారు వేదికపై నుంచే తమ ప్రాజెక్టుల ప్రారంభ తేదీలను ప్రకటించడం విశేషం. అనంతరం ఆయా కంపెనీల ప్రతినిధులతో ముఖాముఖి నిర్వహించిన సీఎం, వారి ఉత్పత్తులు, పనితీరు గురించి ఆరా తీశారు.

ఆనుక్షణం ప్రజల పక్షం RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక
శనివారం 4 జులై 2026

# నకిలీ విత్తనాలు అమ్మితే పీడీ యాక్ట్ తప్పదు

**పురుగుమందుల దుకాణాలపై వ్యవసాయశాఖ ఆకస్మిక తనిఖీలు**

**రికార్డుల్లో లోపాలు ఉంటే కఠిన చర్యలు: ఏవో రాజ్‌కుమార్**

**ఎల్కతుర్తి/, జూలై 3 (జర్నలిస్ట్ వార్త):**



రైతులను మోసం చేస్తూ నకిలీ విత్తనాలు, నాసిరకం పురుగుమందులు విక్రయించే వ్యాపారులపై పీడీ యాక్ట్‌తో పాటు కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి రాజ్‌కుమార్ హెచ్చరించారు. ఎల్కతుర్తి మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లోని పెస్టిసైడ్, విత్తనాలు, ఎరువుల దుకాణాలపై శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.సహాయ వ్యవసాయ సంచాలకులు ఆదిరెడ్డి, మండల వ్యవసాయ అధికారులు పూన్నం చందర్ తదితరులతో కలిసి దుకాణాల్లోని స్టాక్ రిజిస్టర్లు, కొనుగోలుఅమ్మకాల రికార్డులు, లైసెన్సులు, నిల్వలు, ధరల పట్టికలను పరిశీలించారు. రైతులకు స్పష్టంగా కనిపించేలా స్టాక్ బోర్డులు, ధరల పట్టికలు తప్పనిసరిగా ప్రదర్శించాలని దుకాణ యజమానులను ఆదేశించారు.నిబంధనలకు విరుద్ధంగా నకిలీ విత్తనాలు, నాసిరకం పురుగుమందులు విక్రయించినా, రికార్డుల్లో అవకతవకలు ఉన్నా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని రాజ్‌కుమార్ స్పష్టం చేశారు. రైతులు కూడా విత్తనాలు, పురుగుమందులు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని, అనుమానం కలిగితే వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.

# గాంధీభవన్ ముట్టడికి సిద్ధం కావాలి

**వికలాంగుల హామీలు అమలు చేయాలని డిమాండ్**



**మోతె,/ జూలై 3( జర్నలిస్ట్ వార్త)** అసెంబ్లీ ఎన్నికల సమయంలో వికలాంగులకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ డిమాండ్ చేశారు. హామీల అమలు కోసం రాష్ట్ర చరిత్రలో నిలిచేలా గాంధీభవన్ ముట్టడి కార్యక్రమాన్ని చేపడతామని ప్రకటించారు.సూర్యాపేట జిల్లా మోతె మండలం హుస్సేనాబాద్‌లో శుక్రవారం జిల్లా క్రమశిక్షణ కమిటీ చైర్మన్ జంజీరాల సుధాకర్ ఆధ్వర్యంలో, మండల అధ్యక్షుడు జిల్లేపల్లి శివకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల హామీలైన వికలాంగుల పెన్షన్‌ను రూ.6 వేలుకు పెంచడం, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడం, బ్యాక్‌లాగ్ ఉద్యోగాల భర్తీ, ప్రత్యేక వికలాంగుల సంక్షేమ శాఖ ఏర్పాటు, పెండింగ్ సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో వికలాంగులకు రాజకీయ రిజర్వేషన్ కల్పించేలా ప్రత్యేక చట్టం తీసుకురావాలని, ఆ హామీ అమలయ్యే వరకు గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలు నిర్వహించవద్దని డిమాండ్ చేశారు. వికలాంగుల సమస్యల పరిష్కారం వరకు తమ ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు.సమావేశంలో మాజీ సర్పంచ్ ఆంధ్రారెడ్డి, సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# పచ్చని చెట్లకు కొమ్మల కోత..!

**చెన్నూరులో ఏళ్ల నాటి వృక్షాల నరికివేతపై వివాదం**

**విచారణ చేపట్టాలని గ్రామస్తుల డిమాండ్**


**కల్లూరు/జూలై 3 (జర్నలిస్ట్ వార్త):**



ప్రభుత్వం హరితహారం పేరుతో కోట్లాది మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచాలని ప్రచారం చేస్తుంటే.. కల్లూరు మండలం చెన్నూరు గ్రామంలో మాత్రం ఏళ్లుగా పెరిగిన పచ్చని వృక్షాలకు కొమ్మల కోత పడింది. సుమారు 13 ఏళ్ల క్రితం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఆర్అండ్‌బీ రహదారి వెంట నాటిన చెట్లను ఇటీవల పెద్ద ఎత్తున నరికివేశారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటన గ్రామంలో చర్చనీయాంశంగా మారింది.గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ ప్రజలు ఎంతో శ్రమించి పెంచిన ఈ చెట్లు ప్రస్తుతం భారీ వృక్షాలుగా మారాయి. వాటి నీడలో బాటసారులు, రైతులు, గ్రామ పెద్దలు సేదతీరుతూ ఉండేవారు. అయితే దాదాపు పది రోజుల క్రితం విద్యుత్ లైన్ల నిర్వహణ పేరుతో చెట్ల కొమ్మలను భారీగా తొలగించారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండానే, గ్రామపంచాయతీతో సంప్రదింపులు లేకుండానే ఈ చర్య చేపట్టారని వారు వాపోతున్నారు.

ఒకవైపు చెట్లు నాటాలని ప్రభుత్వం ప్రచారం చేస్తుంటే.. మరోవైపు ఏళ్లుగా పెరిగిన వృక్షాలను ఈ స్థాయిలో నరికివేయడం ఎంతవరకు సమంజసమని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. చెట్ల కొమ్మల తొలగింపునకు అటవీశాఖ అనుమతితీసుకున్నారా? సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చారా? నిబంధనల మేరకే ఈ ప్రక్రియ జరిగిందా? అనే అంశాలపై సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.ఈ ఘటనపై అటవీశాఖ రేంజర్, ఎంపీడీవో కార్యాలయం, గ్రామపంచాయతీ అధికారులకు గ్రామస్తులు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. జరిగిన వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన తాత గణేష్.



**బయ్యారం/,జులై 3.(జర్నలిస్ట్ వార్త)**బయ్యారం మండలం కొత్తపేట పంచాయతీలో వేణిగళ్ళ జగ్గయ్య ఫంక్షన్ హాల్ లో శుక్రవారం వీరబోయిన సంపత్ ఉమ దంపతుల కూతురు వివాహం యల్లావుల శారద శ్రీనివాస్ దంపతుల కుమారుడు జయంత్ కుమార్ తో అంగరంగ వైభవంగా జరిగింది.ఈ వేడుకకు బిఆర్ఎస్ పార్టీ బయ్యారం మండల అధ్యక్షులు తాత గణేష్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.వారి దాంపత్య జీవితం ఆనందం, ఆయురారోగ్యం, ఐశ్వర్యం, సుఖశాంతులతో నిండి, ఆదర్శ దంపతులుగా చిరకాలం సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో నీలారపు సంపత్,మేడి సాగర్, చంద్రమౌళి,సునీల్ నాయక్,ఉదయ్ కుమార్,శ్రీనివాస్,వీరన్న తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థినులకు ధైర్యమే రక్షణ.. షీ టీం భరోసా

**సైబర్ నేరాలు, వేధింపులపై అప్రమత్తంగా ఉండాలి**

**నర్సంపేట/, జూలై 3 (జర్నలిస్ట్ వార్త):**
బాలికల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, ఎలాంటి వేధింపులు ఎదురైనా భయపడకుండా వెంటనే పోలీసులను ఆశ్రయించాలని వరంగల్ కమిషనరేట్ పరిధిలోని నర్సంపేట డివిజన్ షీ టీం అధికారులు విద్యార్థినులకు పిలుపునిచ్చారు. శుక్రవారం చెన్నారావుపేట జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు.మహిళలు, బాలికలపై జరుగుతున్న వేధింపులు, సైబర్ నేరాల పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని వివరించారు. సోషల్ మీడియా వినియోగంలో అపరిచితుల పరిచయాలు, వ్యక్తిగత వివరాల భాగస్వామ్యం, ఫేక్ అకౌంట్లు, ఆన్‌లైన్ మోసాల పట్ల




అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే 100, 1091 హెల్ప్‌లైన్ నంబర్లకు సమాచారం అందించి పోలీసుల సహాయం పొందాలని తెలిపారు.విద్యార్థినులకు చట్టపరంగా కల్పించిన రక్షణలు, షీ టీం సేవలు, ఫిర్యాదు చేసే విధానాన్ని వివరించి, ఎలాంటి పరిస్థితుల్లోనూ భయపడకుండా సమస్యలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం విద్యార్థినులు అడిగిన పలు సందేహాలకు అధికారులు సమాధానాలు ఇస్తూ విలువైన సూచనలు అందించారు.ఇలాంటి అవగాహన కార్యక్రమాలు విద్యార్థినుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు భద్రతపై బాధ్యతాయుతమైన అవగాహన కల్పించడంలో దోహదపడతాయని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మానుపాటి పాపమ్మ అన్నారు.కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు మానుపాటి పాపమ్మ, ఉపాధ్యాయులు, షీ టీం అధికారులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# భావితరాల కోసం మొక్కలు నాటాలి

**వనమహోత్సవాన్ని పండుగలా నిర్వహించాలి: కలెక్టర్ దివాకర్ టీఎస్**





**సత్తుపల్లి/, జూలై 3( జర్నలిస్ట్ వార్త)**
భావితరాల సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు.ఆశా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం సత్తుపల్లి జేవీఆర్ కళాశాల మైదానంలో నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్‌తో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మొక్కలు నాటి, జేవీఆర్ కళాశాల నుంచి పాత సెంటర్ వరకు నిర్వహించిన భారీ ర్యాలీలో పాల్గొన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల విద్యార్థులు, యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వనమహోత్సవాన్ని కేవలం మొక్కలు నాటే కార్యక్రమంగా కాకుండా ప్రజల భాగస్వామ్యంతో పండుగలా నిర్వహించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి, అది పెద్ద చెట్టుగా ఎదిగే వరకు సంరక్షించాలని కోరారు. వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించేందుకు మొక్కల పెంపకమే శాశ్వత పరిష్కారమని అన్నారు.ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ.. పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో చెట్ల పాత్ర కీలకమని చెప్పారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించడం కూడా ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ అజయ్ యాదవ్, జిల్లా అటవీ అధికారి అనూజ్ అగర్వాల్, ఆశా స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# గుండ్ల సింగారంలో భూపోరాటం ఉధృతం

**వంటావార్పులో సీపీఐ నేతల -ఇండ్ల కూల్చివేతలు నిలిపివేయాలని డిమాండ్**

**హనుమకొండ/బ్యూరో జూలై 3( జర్నలిస్ట్ వార్త):**
హనుమకొండ జిల్లా గుండ్ల సింగారంలోని సురవరం సుధాకర్‌రెడ్డి నగర్‌లో ఇండ్ల కూల్చివేతలకు నిరసనగా పేదలు చేపట్టిన భూపోరాటం శుక్రవారం కొనసాగింది. ఈ సందర్భంగా నిర్వహించిన వంటావార్పు కార్యక్రమంలో సీపీఐ జాతీయ మాజీ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్ళపల్లి శ్రీనివాసరావు పాల్గొని బాధితులకు సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేదలకు గృహ హక్కు కల్పిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం, వారి నివాసాలను కూల్చివేయడం బాధాకరమన్నారు. నిరుపేదల ఇండ్ల కూల్చివేతలను వెంటనే నిలిపివేసి, అర్హులైన కుటుంబాలకు ఇంటి స్థలాలు కేటాయించి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.గుండ్ల సింగారంలోని సర్వే నంబర్లు 174, 175లో చెరువు శిఖం



భూమి లేదని, గతంలో 1,360 మంది పేదలకు ఇంటి స్థలాలు కేటాయించారని పేర్కొన్నారు. గత ఐదేళ్లుగా సీపీఐ ఆధ్వర్యంలో పేదలు అక్కడ భూపోరాటం నిర్వహిస్తూ నివాసం ఉంటున్నారని తెలిపారు. ప్రభుత్వం సమస్యను సామరస్యంగా పరిష్కరించాలని, లేకపోతే భూపోరాటాలను రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తామని



హెచ్చరించారు.కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, రాష్ట్ర సమితి సభ్యురాలు మంద సదాలక్ష్మి, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ, పార్టీ నాయకులు, భూపోరాట కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.



# పామాయిల్ మొక్క నాటిన కొత్తపేట సర్పంచ్.

**బయ్యారం/,జులై 3.(జర్నలిస్ట్ వార్త):** రైతుల ఆదాయాన్ని పెంచేందుకు లాభదాయకమైన పామాయిల్ సాగుపై దృష్టి సారించాలని కొత్తపేట సర్పంచ్ భూక్యా ప్రవీణ్ నాయక్ అన్నారు.ఈ సందర్భంగా పాతూరి శ్రీను తన వ్యవసాయ క్షేత్రంలో పామాయిల్ తోట నాటేందుకు ఏర్పాటు చెయ్యగా సర్పంచ్ ప్రవీణ్ నాయక్ వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించి పామాయిల్ మొక్క నాటారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పామాయిల్ సాగు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ప్రోత్సహిస్తుందని తెలిపారు.ఈ పంట దీర్ఘకాలిక పంటతో ఎకరాకు రూ.1.5 నుండి రూ. 3 లక్షల వరకు నికర ఆదాయం వస్తుందని తెలిపారు.ఒక్కసారి నాటితే 35 ఏళ్ల వరకు పంట ఎకరాకు రూ.3 లక్షల వరకు ఆదాయం వస్తుందని రైతులు పామాయిల్ సాగుపై దృష్టి సారించాలన్నారు.ఈ పంట ద్వారా సంవత్సరానికి ఖర్చులు పోగా, రైతులకు ఎకరానికి భారీగా ఆదాయం వస్తున్నందున రైతులను ఈ పంట సాగు వైపు మళ్లించాలని కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో పాతూరి శ్రీను,పెనుగొండ రమణయ్య,అశోక్ రెడ్డి,ఉదయ్,సెత్ రామ్ తదితరులు పాల్గొన్నారు.

# కుటుంబంతో కనకదుర్గమ్మను దర్శించుకున్న మువ్వా విజయబాబు



**విజయవాడ/జూలై 3 (జర్నలిస్ట్ వార్త);**తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీజీఐడీసీ) చైర్మన్ మువ్వా విజయబాబు శుక్రవారం కుటుంబ సభ్యులతో కలిసి ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. అనంతరం ఆలయ అధికారులు వేద ఆశీర్వచనం అందించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

# కార్మికుల భద్రతకే పెద్దపీట

## మున్సిపల్ చైర్మన్ సారంగపాణి

**వర్ధన్నపేటలో పారిశుధ్య సిబ్బందికి రక్షణ సామగ్రి పంపిణీ**


**స్వయంగా కాలువలు శుభ్రం చేసిన చైర్మన్**





**వర్ధన్నపేట/జులై3(జర్నలిస్ట్ వార్త);** మున్సిపాలిటీ పరిధిలోని పారిశుధ్య కార్మికుల సంక్షేమం, భద్రతకు తమ పాలకవర్గం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి అన్నారు. పట్టణంలోని పారిశుధ్య సిబ్బందికి ఆయన రేన్ కోట్లు, షూస్, ఏప్రాన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ వర్షాకాలంలోనూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు నిరంతరం శ్రమిస్తున్న కార్మికుల సేవలు అమూల్యమైనవని కొనియాడారు. అనంతరం ఆయన స్వయంగా కార్మికులతో కలిసి సైడ్ కాలువలను శుభ్రం చేసి ప్రజల్లో అవగాహన కల్పించారు. ప్రజల సహకారంతో వర్ధన్నపేటను ఆదర్శ పట్టణంగా అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బి.పాపరావు, నాయకులు ఎన్.రాజేందర్, టి.కుమారస్వామి, ఎస్.రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన బయ్యారం సర్పంచ్.



**బయ్యారం/,జులై 3.(జర్నలిస్ట్ వార్త)**బయ్యారం మండలం కొత్తపేట పంచాయతీలో వేణిగళ్ళ జగ్గయ్య ఫంక్షన్ హాల్ లో శుక్రవారం వీరబోయిన సంపత్ ఉమ దంపతుల కుమార్తె వివాహం యల్లావుల శారద శ్రీనివాస్ దంపతుల కుమారుడు జయంత్ కుమార్ తో అంగరంగ వైభవంగా జరిగింది.ఈ వేడుకకు బయ్యారం సర్పంచ్ శాంతి కిషన్ నాయక్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.వీకి వైవాహిక జీవితం అన్యోన్యంగా ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఎనుగుల ఉమ,జిల్లా కిసాన్ సెల్ ప్రధాన కార్యదర్శి పెద్దినేని వెంకటేశ్వరరావు,బయ్యారం పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాయిని శ్రీనివాస్ రెడ్డి,బీరెడ్డి శ్రీనివాస్,నందగిరి భద్రయ్య,పులి మల్లయ్య,లింగన్న,కోడి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారమే లక్ష్యం.



**బయ్యారం/,జులై 3.(జర్నలిస్ట్ వార్త)**బయ్యారం మండలం కొత్తపేట గ్రామపంచాయతీలో కురవి ఉపవిభాగ పరిధిలోని కొత్తపేట సెక్షన్ కార్యాలయంలో విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదిక ఆధ్వర్యంలో స్థానిక విచారణ కార్యక్రమం నిర్వహించారు.కురవి ఉపవిభాగ పరిధిలోని కురవి,డోర్నకల్,సీరోల్,గార్ల, బయ్యారం మండలాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు,కొతపేట సర్పంచ్ భూక్యా ప్రవీణ్ నాయక్, జగ్గుతండ సర్పంచ్ బొల్లి జయంతి వెంకటకృష్ణ కార్యక్రమానికి హాజరై విద్యుత్ సరఫరా,బిల్లింగ్,కనెక్షన్లు ఇతర సేవలకు సంబంధించిన తమ సమస్యలను,ఫిర్యాదులను వేదిక దృష్టికి తీసుకువచ్చారు.సీజీఆర్ఎఫ్ సభ్యులు వినియోగదారులు సమర్పించిన ప్రతి ఫిర్యాదును శ్రద్ధగా విని,సంబంధిత అధికారులతో చర్చించి,నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించేందుకు అవసరమైన ఆదేశాలు జారీ చేశారు. వినియోగదారుల సమస్యలను పారదర్శకంగా,సకాలంలో పరిష్కరించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని సభ్యులు తెలిపారు.ఈ కార్యక్రమంలో సీజీఆర్ఎఫ్ సభ్యులు జి.నాగ ప్రసాద్,ఎల్.కిషన్,ఎం.రామారావు,పి.విజేందర్ రెడ్డి,ఎస్ఈకోటేశ్వర్ రావు,డిఈ హీరాలల్,డిఈ టెక్నికల్ రామ దేవి,విద్యుత్ శాఖ అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# నేడు విద్యాసంస్థల బంద్ విజయవంతం చేయాలి

**విద్యారంగ సమస్యల పరిష్కారానికి వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపు**



**నర్సంపేట/ జూలై 3 (జర్నలిస్ట్ వార్త):** రాష్ట్రంలోని విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం నిర్వహించనున్న రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, ఏఐఎఫ్‌డీఎస్, ఎస్ఎఫ్ఐ నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం నర్సంపేటలోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను తగ్గించే ప్రతిపాదనను ప్రభుత్వం విరమించుకోవాలని, విద్యాశాఖకు పూర్తి స్థాయి మంత్రిని నియమించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రెండు జతల యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు సకాలంలో అందించాలని, మధ్యాహ్న భోజన పథకానికి నిధులు పెంచి మహిళా సంఘాల ద్వారా అమలు చేయాలని డిమాండ్ చేశారు.ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజులను నియంత్రించేందుకు చట్టం తీసుకురావాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయులు, లెక్చరర్లు, ఎంఈఓ, డీఈఓ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేసి జీఓలు 7, 8, 9లను రద్దు చేయాలని అన్నారు.ఇంటర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయడంతో పాటు అద్దె భవనాల్లో నడుస్తున్న పాఠశాలలు, హాస్టళ్లు, గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. ప్రతి పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్‌లు, తాగునీరు, విద్యుత్, ఇంటర్నెట్, మరుగుదొడ్లు తదితర మౌలిక వసతులు కల్పించాలని కోరారు. విద్యార్థులకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించి బడి బస్సులు నడపాలని సూచించారు.మెస్, కాస్మోటిక్ చార్జీలను పెంచి పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని, విద్యాసంస్థల్లో ర్యాగింగ్, డ్రగ్స్ నిరోధక కమిటీలు, ఐసీసీ కమిటీలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విద్యాహక్కు చట్టాన్ని అమలు చేసి పేద విద్యార్థులకు 25 శాతం ఉచిత ప్రవేశాలు కల్పించాలని, రాష్ట్రంలో విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహించాలని కోరారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలైన విద్యా భరోసా కార్డులు, ఉచిత ల్యాప్‌టాప్‌ల పంపిణీని అమలు చేయాలని, ప్రైవేట్ విద్యాసంస్థల్లో పుస్తకాలు, యూనిఫాంల బలవంతపు విక్రయాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఎన్ఈపీ2020ను తెలంగాణలో అమలు చేయకుండా అసెంబ్లీలో తీర్మానం చేయాలని కోరారు.

సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు దిడ్డి పార్థసారథి, పీడీఎస్‌యూ నాయకులు గుర్రం అజయ్, రాజు, ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా అధ్యక్షుడు జన్ను రమేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పైసా గణేష్‌తో పాటు సిద్ధు, వంశీ, ప్రశాంత్, కళ్యాణ్, శ్యామ్, అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.

# కస్తూర్బా విద్యాలయంలో జాయింట్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**విద్యా ప్రమాణాలు, భోజనం, వసతి సౌకర్యాలపై క్షుణ్ణ పరిశీలన.. విద్యార్థులతో మమేకమై వివరాల సేకరణ**









**ధర్మసాగర్ /హనుమకొండ బ్యూరోజూలై 3 (జర్నలిస్ట్ వార్త):** ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యా ప్రమాణాలు, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, ఆహార నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారిస్తున్న జిల్లా యంత్రాంగం తనిఖీలను మరింత ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలోని ముప్పారం గ్రామంలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని హనుమకొండ జిల్లా జాయింట్ కలెక్టర్ రవి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ముందుగా విద్యాలయ ఆవరణ, తరగతి గదులు, ప్రయోగశాల, వంటశాల, స్టోర్‌రూమ్, హాస్టల్, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాలు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యత, మెనూ అమలు, నిల్వ ఉంచిన బియ్యం, పప్పులు, కూరగాయలు, ఇతర ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.

అనంతరం విద్యార్థులతో నేరుగా మాట్లాడిన జాయింట్ కలెక్టర్, వారికి బోధిస్తున్న పాఠ్యాంశాలు, ఉపాధ్యాయుల బోధన విధానం, చదువుపై అవగాహన, పరీక్షల సన్నద్ధత, హాస్టల్‌లో కల్పిస్తున్న వసతులపై ప్రశ్నలు అడిగి వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులు తెలిపిన అంశాలను శ్రద్ధగా విన్న ఆయన, విద్యతో పాటు క్రమశిక్షణ, పరిశుభ్రతకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.విద్యాలయం నిర్వహణ, పరిశుభ్రత, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై సంతృప్తి వ్యక్తం చేసిన జాయింట్ కలెక్టర్, ఇదే స్థాయిలో ప్రమాణాలు కొనసాగించాలని విద్యాలయ సిబ్బందికి సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు నిరంతరం కృషి చేయాలని ఆదేశించారు.ఈ తనిఖీలో ధర్మసాగర్ తహసీల్దార్ బావు సింగ్, ఎంపీడీవో అనిల్ కుమార్, ముప్పారం సర్పంచ్ గుంటిపల్లి రేణుక వెంకట్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సుమలతతో పాటు సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సహకారమే రైతుకు శ్రీరామరక్ష..

**సేవలు సద్వినియోగం చేసుకోవాలి**

**ధర్మసాగర్ పీఏసీఎస్ వారోత్సవాల్లో జిల్లా సహకార అధికారి బి. మోహన్**



**ధర్మసాగర్ /హనుమకొండ బ్యూరోజూలై 3 (జర్నలిస్ట్ వార్త):** సహకార సంఘాలు బలోపేతమైతేనే రైతులకు ఆర్థిక భరోసా మరింత పెరుగుతుందని జిల్లా సహకార అధికారి బి. మోహన్ అన్నారు. ధర్మసాగర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) ఏర్పాటు చేసి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా జూన్ 29 నుంచి జూలై 6 వరకు నిర్వహిస్తున్న కో-ఆపరేటివ్ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా సహకార అధికారి బి. మోహన్, కేటీసీటీ ప్రిన్సిపాల్ యాకుబ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా బి. మోహన్ మాట్లాడుతూ సహకార సంఘాల అభివృద్ధి రైతుల భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుందని చెప్పారు. పీఏసీఎస్ ద్వారా రైతులకు అందిస్తున్న రుణాలు, ఎరువులు, ఇతర సేవలను సద్వినియోగం చేసుకుని వ్యవసాయాన్ని మరింత లాభదాయకంగా మార్చుకోవాలని సూచించారు. ప్రతి రైతు సహకార సంఘంతో అనుబంధం పెంచుకుని సంఘం బలోపేతానికి తోడ్పడాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో ఎఫ్‌పీఓ డొమైన్ ఎక్స్‌పర్ట్ నరేష్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ యాద కుమారస్వామి, డైరెక్టర్లు బిల్లా అమరేందర్ రెడ్డి, బొడ్డు లెనిన్, పోలుమారి విజయ, మడికంటి రాజయ్య, జంగా వీరయ్య, ధర్మసాగర్ డీసీసీ బ్యాంక్ మేనేజర్ వెంకటేష్, సూపర్వైజర్ శ్రీనివాస్ రెడ్డి, పీఏసీఎస్ కార్యదర్శి పింగిలి రాజిరెడ్డి, కార్యాలయ సిబ్బంది ఆవుల కుమారస్వామి, బొడ్డు ప్రభుదేవ్, పోలుమారి ప్రవీణ్ కుమార్, కలకోటి మురలీకృష్ణ, రాజేందర్, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# విద్యుత్ సమస్యను తీర్చిన ఉపసర్పంచ్, వార్డు సభ్యుడు

**నల్లబెల్లిలో విరిగిపడిన చెట్టును తొలగించిన దేవేందర్, ప్రశాంత్ -హర్షం వ్యక్తం చేసిన కాలనీవాసులు**







**వర్ధన్నపేట/జులై 3(జర్నలిస్ట్ వార్త);** వర్ధన్నపేట మండలం మండల పరిధిలోని నల్లబెల్లి గ్రామంలో గాలివాన కారణంగా ఏర్పడిన విద్యుత్ సమస్యను ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని పరిష్కరించారు. గ్రామంలోని 3, 4 వార్డుల పరిధిలో విద్యుత్ స్తంభాలు, తీగలపై ఒక్కసారిగా పెద్ద చెట్టు విరిగిపడింది. దీంతో ఆయా వార్డుల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడ్డారు.ఈ విషయం తెలుసుకున్న గ్రామ ఉపసర్పంచ్ మేకల దేవేందర్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు, వార్డు సభ్యుడు మరుపట్ల ప్రశాంత్ వెంటనే స్పందించారు. విద్యుత్ సిబ్బంది కోసం వేచి చూడకుండా, తామే స్వయంగా గొడ్డళ్లతో రంగంలోకి దిగి తీగలపై పడిన చెట్టు కొమ్మలను నరికి పక్కకు తొలగించారు. అనంతరం విద్యుత్ పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు.

సకాలంలో స్పందించి సమస్యను తీర్చిన ఉపసర్పంచ్, వార్డు సభ్యుడికి కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ నల్లబెల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో జీపీ సిబ్బంది ప్రభాకర్, ప్రశాంత్, స్థానిక కాలనీవాసులు,బిర్రు ఎల్లయ్య బిర్రు బిక్షపతి బిర్రు స్వామి గుండేటి శివ కృష్ణ బిర్రు వర్షిత్, ఎలక్ట్రిటీ సిబంది కృష్ణ తదితరులు

## ఓటర్లకు మరింత అవగాహన కల్పించాల్సి ఉంది

### ఎమ్మెల్యే - తీగుళ్ళ పద్మారావు గౌడ్



**సికింద్రాబాద్/జూలై 3(జర్నలిస్ట్ వార్త);**
సికింద్రాబాద్ పరిధిలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా అర్హులైన ఓటర్ల పేర్లు నమోదు చేసుకొనేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సికింద్రాబాద్ శాసనసభ్యులు మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుళ్ళ పద్మారావు గౌడ్ అధికారులకు బిఆర్ఎస్ శ్రేణులకు సూచించారు. అవసరమైన పక్షంలో ప్రజలకు ఉపకరించేలా సహాయతా కేంద్రాలను ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. చిలకలగూడా లో స్థానికులు ఏర్పాటు చేసిన సహాయతా కేంద్రాన్ని పద్మారావు గౌడ్ శుక్రవారం పరిశీలించారు. అదే విధంగా జోషి కాంపౌండ్ లో ఏనుమరేషన్ పత్రాల పంపిణీ ప్రక్రియ ను పద్మారావు గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరి ఓటును జాబితాలో పొందేలా కృషి చేయాలని బిఎల్ఎ లు చొరవ తీసుకోవాలని ఆదేశించారు. బిఆర్ఎస్ యువ నేత తీగుళ్ళ కిశోర్ కుమార్, సమన్వయకర్త రాజా సుందర్ , జహంగీర్ భాయి, సీనియర్ నాయకులు రాజేష్, పాక సాయి తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా సవరణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

### మాజీ కార్పొరేటర్ - డాక్టర్ హేమ సామల



**సికింద్రాబాద్/జూలై 03(జర్నలిస్ట్ వార్త);**
కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్)లో భాగంగా సీతాఫలమండి ప్రాంతంలో మాజీ కార్పొరేటర్ డాక్టర్ హేమ సామల విస్తృతంగా పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. బూత్ లెవెల్ ఆఫీసర్ (బీఎల్ఓ)తో కలిసి ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేటర్ ఫారాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా డా. సామల హేమ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడైన పౌరుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. కుటుంబ సభ్యుల ఓటరు వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, పేర్లు, వయస్సు, చిరునామా తదితర వివరాల్లో ఎలాంటి పొరపాట్లు లేకుండా ఫారాలను నింపాలని సూచించారు.ప్రస్తుతం పంపిణీ చేస్తున్న ఫారాలను మూడు రోజుల తర్వాత బీఎల్ఓలు తిరిగి సేకరిస్తారని, అందువల్ల ప్రజలు నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో పూర్తి చేసి అందించాలని ఆమె తెలిపారు. ఓటరు జాబితాలో పేర్లు తొలగిపోవడం, వివరాల్లో తప్పులు ఉండడం వంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.అలాగే బూత్ లెవెల్ ఆఫీసర్లు ప్రజలకు అందుబాటులో ఉండి అవసరమైన సహాయం అందించాలని సూచించారు. ఓటరు సవరణ ప్రక్రియలో పారదర్శకత,ఉండేలా బీఎల్ఓలు, బీఆర్ఎస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్లు పరస్పర సమన్వయంతో పనిచేస్తారని తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలందరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఓటరు వివరాలను సరిచూసుకుని అవసరమైన సవరణలు చేయించుకోవాలని, అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కు పరిరక్షించబడేలా కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బి.ఎల్.ఓ రేవతి,నాయకులు గగన తదితరులు పాల్గొన్నారు

## ఎస్ఐఆర్ కార్యక్రమంపై విస్తృత అవగాహన కల్పిస్తున్న బిఆర్ఎస్ నాయకురాలు - మురారి స్మితా కోటేష్ గౌడ్

**సికింద్రాబాద్/జూలై 3(జర్నలిస్ట్ వార్త);**
ఎస్ఐఆర్ కార్యక్రమంపై విస్తృత అవగాహన కల్పిస్తున్న బిఆర్ఎస్ పార్టీ మహిళ సీనియర్ నాయకురాలు మురారి స్మితా కోటేష్ గౌడ్ శుక్రవారం మాజీ డిప్యూటీ స్పీకర్ సికింద్రాబాద్ శాసనసభ్యులు తీగుళ్ళ పద్మారావు గౌడ్ ఆదేశాల మేరకు తార్నాక డివిజన్ కింటి కాలనీ, పలు ప్రాంతాల్లో బిఎల్ఓ అఖిల తో కలిసి పర్యటించి ఓటర్లకు అవగాహన కల్పిస్తూ, కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పులు, పేర్ల సవరణలు, మరణించిన వారి పేర్ల తొలగింపు వంటి అంశాలపై ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ



ప్రతి అర్హత కలిగిన పౌరుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఓటరు జాబితాలోని వివరాలను సరిచూసుకుని అవసరమైన మార్పులు చేయించుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్య బలోపేతానికి ప్రతి ఒక్కరి భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని ఆమె తెలిపారు.

## తేజ ఇంటర్నేషనల్ స్కూల్‌లో కాన్షీరామ్ మాదిగ పుట్టినరోజు వేడుకలు











**హనుమకొండ/ జూలై 3 (జర్నలిస్ట్ వార్త):**
హనుమకొండ వడ్డేపల్లి పరిమళ కాలనీలోని తేజ ఇంటర్నేషనల్ హైస్కూల్‌లో విద్యార్థి బిర్రు కాన్షీరామ్ మాదిగ జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఎమ్మార్పీఎస్, ఎమ్ఎస్పీ యాదాద్రి భువనగిరి జిల్లా ఇంచార్జ్ బిర్రు మహేందర్ మాదిగ కుమారుడైన కాన్షీరామ్ పుట్టినరోజును పాఠశాల యజమాన్యం,ప్రిన్సిపాల్ సృజన రమణారెడ్డి, ఆధ్వర్యంలో విద్యార్థుల మధ్య వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాన్షీరామ్ కేక్ కట్ చేసి తోటి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు స్వీట్లు పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ వరంగల్ జిల్లా సీనియర్ నాయకులు గోలి సుధాకర్ మాదిగ, వరంగల్ జిల్లా మాదిగ జర్నలిస్ట్ ఫోరం జిల్లా ఉపాధ్యక్షులు బిర్రు కరుణాకర్ మాదిగ, ఎమ్ఎస్పీ వర్ధన్నపేట మండల అధికార ప్రతినిధి బిర్రు బిక్షపతి మాదిగ ముఖ్య అతిథులుగా హాజరై కాన్షీరామ్‌ను ఆశీర్వదించారు. కాన్షీరామ్ చదువులో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో పాఠశాల పీఈటీలు, ఉపాధ్యాయులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. కాన్షీరామ్ జన్మదిన సంబరాలతో పాఠశాల ఆవరణలో పండుగ వాతావరణం నెలకొంది.





## రాష్ట్రంలో అద్దం లాంటి రోడ్ల నిర్మాణం

**ఈ జూలై నెలలో 10 ప్యాకేజీల పనులు ప్రారంభం**

**నల్లగొండ-మహబూబ్ నగర్ రోడ్డు పనుల్లో వేగం పెంచాలి**

**వర్షాకాలం పూర్తి అయిన తర్వాత మూడు షిఫ్టుల్లో నిర్మాణ పనులు**

**6న కరీంనగర్ జిల్లా హ్యామ్ రోడ్ల పనులకు శంకుస్థాపన**

**హై కోర్టు భవనం,ఉస్మానియా ఆసుపత్రి డిసెంబర్ కల్లా పూర్తి కావాలి**

**టిమ్స్,నిమ్స్,వరంగల్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ పూర్తి చేయండి**

**ప్రాజెక్టుల్లో టెక్నికల్ నాలెడ్జ్ ,కమిట్మెంట్ ఉన్న ఇంజనీర్లను నియమించాలి**

**నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవు**

**ఆర్ అండ్ బి అధికారులతో మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి**



**హైదరాబాద్,జూలై 03(జర్నలిస్ట్ వార్త);**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో 'న భూతో న భవిష్యతి' రీతిలో రాష్ట్రంలో అద్దం లాంటి రోడ్ల నిర్మాణానికి సంకల్పించామని,అందులో భాగంగా జూన్ 28న నల్లగొండ జిల్లా కనగల్ వేదికగా ముఖ్యమంత్రి చేతుల మీదుగా రాష్ట్ర హ్యామ్ రోడ్ల పనుల పైలాన్ ఆవిష్కరణ చేసుకుని,పనులు ప్రారంభించామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. రానున్న రెండేళ్లలో రాష్ట్రంలో ఏ మూలన చూసిన నాణ్యమైన ఆర్ అండ్ బి డబుల్ రోడ్లు వినియోగంలోకి వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. 'మంచి రోడ్డు - ప్రగతికి సూచిక' అని తాను బలంగా విశ్వసిస్తానని, దీంతో పల్లె పట్టణాలకు కనెక్టివిటీ పెరిగి,గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమలు వస్తె స్థానికంగానే ఉద్యోగ,ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. ఆర్ అండ్ బి శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న పలు పనుల పురోగతిపై డా.బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సెక్రటేరియట్ లో రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఆ శాఖ ఉన్నతాధికారులతో సుదీర్ఘ సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఆర్ అండ్ బి లోని విభాగాల వారీగా పనుల పురోగతిపై కూలంకషంగా చర్చించిన మంత్రి,చేపట్టిన కీలక పనులు ఏ దశల్లో ఉన్నాయో అధికారులను ఆరా తీశారు. మొదటి ఫేజ్ లో సుమారు 13వేల కోట్లతో 6092 కి.మీ రోడ్ల పనులు 34 ప్యాకేజీల్లో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టనుండగా..ఈ జూలై నెలలోనే 10 ప్యాకేజీల పనులు ప్రారంభం కానున్నాయని తెలిపారు. ప్యాకేజ్-2లో సుమారు 155 కోట్ల అంచనా వ్యయంతో 42కి.మీ పొడవుగల నల్లగొండ-మహబూబ్ నగర్ డబుల్ రోడ్డు పనులు ఇప్పటికే ప్రారంభమైన నేపథ్యంలో పనుల్లో వేగం పెంచాలన్నారు. ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు ఆశించిన స్థాయిలో లేవని,అయినా..
వర్షాకాలం పూర్తి అయిన తర్వాత మూడు షిఫ్టుల్లో రోడ్ల నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని మంత్రి స్పష్టం చేశారు. రోడ్ల నిర్మాణం కోసం నిష్ణాతులై, నిరంతరం ఫీల్డ్ లో ఉండే ఇంజనీర్లను ఎంపిక చేసి,ప్యాకేజీల వారిగా పనుల బాధ్యతలు అప్పజెప్పాలని,పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయించడం చీఫ్ ఇంజనీర్ల బాధ్యతేనని మంత్రి స్పష్టం చేశారు. ఈనెల 6న కరీంనగర్ జిల్లాలో చేపట్టే హ్యామ్, రోడ్ల పనులకు ఆ జిల్లా మంత్రులు,స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. అందుకు సంబంధిత ఏర్పాట్లు చూడాలని సి.ఈ లు బి.వి రావు,వసంత్ నాయక్ లను మంత్రి ప్రత్యేకంగా ఆదేశించారు. ÷రాజేంద్ర నగర్ లో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న నూతన హై కోర్టు భవనం,జడ్జిల నివాస సముదాయ భవనాల నిర్మాణాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని,నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదికన జరగాలని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు 16 శాతం పనులు పూర్తయ్యాయని సి.ఈ లు రాజేశ్వర్ రెడ్డి, నర్సింగ్ రావు వివరించగా....మూడు షిఫ్టుల్లో నిర్మాణ పనులు జరగాలని,అందుకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచి, నిర్మాణ సంస్థతో సమన్వయం చేసుకుంటూ పనుల్లో వేగం పెంచాలని మంత్రి వారిని ఆదేశించారు. అక్కడ ఆర్ అండ్ బి తరుపున నిర్మాణ పర్యవేక్షణ బాధ్యతలు చూస్తున్న ఇంజనీర్ల సంఖ్యను పెంచాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ 2027 డిసెంబర్ నాటికి ప్రారంభానికి సిద్ధం చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. అట్లాగే ఉస్మానియా జనరల్ ఆసుపత్రి పనుల్లో ఇంకా వేగం పెరగాలని,ఇది కూడా డిసెంబర్ 2027 వరకు పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. సనత్ నగర్ టిమ్స్ ప్రారంభానికి సిద్ధం అయిందని,అల్వాల్, ఎల్బీనగర్ టిమ్స్, నిమ్స్ విస్తరణ,వరంగల్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ నిర్మాణ పనులు వేగవంతం చేసి అతి త్వరలో ప్రజలకు అందుబాటులోకి వచ్చే విధంగా పని చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం
ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ ప్రాజెక్టుల్లో టెక్నికల్ నాలెడ్జ్ ఉండి,మనసుపెట్టి పనిచేసే కమిట్మెంట్ ఉన్న ఇంజనీర్లను నియమించాలనీ మంత్రి సూచించారు.